


*ఓ ఆఫీసరుగారు పార్టీల సుఖమే తన సుఖంగా, వారి క్షేమమే తన క్షేమంగా వారి కష్టసుఖాల్లో పాలుపంచుకునేవారు.*




వాళ్ళ పనులు తన స్వంతపనుల కన్నా ఎక్కువగా చూసుకునేవాడు. వెంటనే చేసి పుణ్యం కట్టుకునేవాడు. ఆ పుణ్యఫలం వూరకనేపోయేది కాదు. 'మంత్రపుష్పం' రూపంలో ఆ ఆఫీసరుగారికి దండిగా నే లాభం తెచ్చిపెట్టేది. ఆ పార్టీలు కూడా ఆయన అక్కడ్నించి బదిలీ కాకుండా కొన్ని కాలాలపాటు అక్కడే వుంటే బావుణ్ణనుకున్నారు కాని, అనుకోకుండా ఆయనకి ట్రాన్స్‌ఫరొచ్చింది. కదలక తప్పలేదు.

కొత్త ఆఫీసరు మరీ చేతకానివాడు. డబ్బు తీసుకోడు. వెంటనే పనిచెయ్యడు. అంతా చాదస్తం. రూల్సు అంటూ పిచ్చి మాటలు చెపుతాడు. అన్నీ కరెక్టుగా వుంటేనేగాని సంతకం పెట్టను పొమ్మంటాడు. ఇది పార్టీలకి మహా యిబ్బంది కలిగిస్తున్న విషయం.

పానకాలరావుకయితే మరీ కష్టంగా వుంది. ఆయన బిల్లు ఒకటి— కొన్నిలక్షలు కలిసొచ్చేది— కొత్త ఆఫీసరు కాలికింద నిర్దాక్షిణ్యంగా నలిగిపోతోంది. కాలదోషం పట్టేపేలా వుంది. ఎవరో అతనికి అమూల్యమైన సలహా యిచ్చారు పాత ఆఫీసరు టైంలో బిల్లు పెట్టినట్టు ఆఫీసు ముద్ర కొట్టించేసుకుని, వెళ్ళి పాత ఆఫీసరుగార్ని పట్టి, సంతకం పెట్టించేసుకోమని!

పానకాలరావు ఆఫీస్ ప్యూన్ సాయంతో బిల్లు బయటికి లాగించి, పాత డేట్ స్టాంపు కొట్టించేశాడు. గుమాస్తాలని చూసేలా చూసి, చెయ్యాల్సిన పనులు చేయించేశాడు. సరాసరి పాత ఆఫీసరుగార్ని కలిసి "మంత్రపుష్పం" యిచ్చేశాడు. ఆయన పానకాలరావు తెలివిని అభినందించి దస్కత్తు చేసేశాడు.

ఆనందంగా బిల్లు ట్రెజరీకి సమర్పించుకున్నాడు పానకాలరావు. అయితే అది వెళ్ళినంత తొందరగాను తిరిగొచ్చేసింది— పాస్ ఆర్డరు పడకుండా; తప్పుడు సంతకం పడిందనే రిమార్కుతో.

పాత ఆఫీసరుగారు తప్పెందుకావటానికీ, పానకాలరావు పథకం బెడిసికొట్టి పోవటానికీ కీలకమైన కారణం మరేం కాదు- పాత ఆఫీసరు పొరపాటున, సంతకం పెట్టినరోజు తేదీ బిల్లుమీద వేసేశాడు!

---

*వర్షం కుండపోతగా కురుస్తున్నది. షావుకారు సాలయ్య గల్లాపెట్టె ముందు కూర్చున్నాడు. బేరంలేక నౌకరు లాలయ్య కునికిపాట్లు పడుతున్నాడు.*




"వారీ! లాలుగా కూరుకుతన్నావురా?"

"ఏంజెయ్యాల్నయ్యా!"

"పని లేకుంటె కూదుకుమనేనారా నీకు నెలకు యాభయిచ్చేది?"

"బాంచెన్ సేట్."

ఏం పని చెప్పాలో సాలయ్యకు చప్పున తోచలేదు.

"లాలుగా నీకు కథలొస్తాయిరా?"

"వత్తయి. ఏం కత చెప్పుమంటరు.... భట్టి ఇక్రమార్కనిది, సెన్నాల రామలింగుది" లాలయ్య.

"ఏదో నా బొంద కత సెప్పు" సాలయ్య విసుక్కున్నడు.

"ఎనుకట మాంచి షావుకారి వుండెనట. మా దండి విజ్జె బుద్ధి గల్గినోడట. కూసంత పిసినారట. గుమ్ముల నిండా ధాన్యం, సందుగల నిండా సొమ్ము. మేడ మీద మేడ సంపాయించి ఆఖర్న సెల్లి పోయిండట...."

"అయ్యో! పాపం...."

"అయితే సొన్నాయిలు, తమ్మెట్లే కాక పట్నంనుంచి బ్యాండోల్లను పిలిపిచ్చి ఘణంగా పూలు జల్లుకుంట శవాన్ని వూరేగించుకుంట తీస్కపోతున్నరట. అంతట్ల కొడుకు ఏకుడు పేలాలు చిల్లర పైసలు చల్లుకుంటూ శవంవెంట నడువంగ...."

"ఆఁ నడువంగ...."

"ఒక్కపారే పీనుగు బరువైపోయి మోసేవాళ్ళు భుజాలు కుంగిపోయి పీనుగు మరింక మోయలేమని కింద దించిండ్లట."

"అదెరా?"

"గదే యెవ్వలకు అంతుబట్టలే....".

షావుకారి సాలయ్య అగ్గిపుల్ల గీకి బీడి ముట్టించి దమ్ములాగి పొగ నోటితోనే.... "మా సెడ్డ సిక్కొచ్చిందే...." అన్నాడు.

"శాత్రం తెలిసిన పురోయితులు డంగయిపోయిండ్లట - ఆ దారెంట సెన్నాల రామలింగు పోతున్నోడు గిసిత్రం జూసి ఆడికచ్చిండట."